భం
# గురువాణి

21 మే, 2026 సంచిక-259



## విధికి తలవంచక తప్పదు

ఆ విధికి అడ్డుపడేవాడు ఎదిరించేవాడు ప్రపంచంలో ఎవడూ పుట్టలేదు దానినే విధి విలాసం అంటారు కనుక ఎటువంటి మహానుభావుడైన విధికి తలవంచక తప్పదు అంటారు పెద్దలు. ఎలా తప్పలేదు అని కన్నడంలో పెద్దలు బాగా చెప్పారు. ″యారిగాదరు తప్పదితే బంధవిదియాప్రేరణ, ఆడి ధర్మజ కెట్ట, ఆడదలి హరిశ్చంద్ర కెట్ట, కూడి సుర పతి కెట్ట, పోరాడి కౌరవ కెట్ట, నంబి కీచక కెట్ట, నమ్మదలే హిరణ్యక కెట్ట, అంబలికి ఆ సీత కెట్టలు, ఉండదలే దుర్వాస కెట్ట″. "THERE IS NO ARMOUR AGAINST FATE" అనే వాక్యానికి కన్నడంలో ఈ విధంగా అర్థము చెబుతారు. శిష్య భక్తాదులారా దీని వివరణ ఈ విధంగా ఉంది.

"ఆడి ధర్మజ కెట్ట" ధర్మరాజు తమ్ముళ్లు చెప్పినా వినకుండా కౌరవులతో జూదమాడి చెడిపోయినాడు, రాజ్యాన్ని కోల్పోయినాడు, ద్రౌపదిని అవమానాల పాలు చేసినాడు.

“ఆడదలి హరిశ్చంద్ర కెట్ట” విశ్వామిత్రుడు ఆ హరిశ్చంద్రుని ఒక అబద్ధం చెప్పు, నీ రాజ్యం, నీ సింహాసనం తిరిగి ఇచ్చేస్తాను అంటాడు. కానీ హరిశ్చంద్రుడు అబద్ధం ఆడలేదు చివరకు ఆయన కాటి కాపరిగా మారవలసి వచ్చినది.

“కూడి సుర పతి కెట్ట” అహల్య పతివ్రతరా నాయన, ఆమె పొందు కోరవద్దు అని ఎంత చెప్పినా వినకుండా ఆ ఇంద్రుడు అవమానాల పాలైనాడు.

“పోరాడి కౌరవ కెట్ట” కౌరవుడు అయిన దుర్యోధనుడు పెద్దల మాట విని కొంత రాజ్యాన్ని పాండవులకు ఇచ్చి ఉంటే ఏమయ్యేది. అలా చేయకుండా హఠం తో పాడై పోయినాడు.

“నంబి కీచక కెట్ట” ద్రౌపది మాటను నమ్మి కీచకుడు అర్ధరాత్రి ఆమె మందిరంలోకి వెళ్లి భీముడి చేతిలో కుక్క చావు చచ్చినాడు.

“నమ్మదలే హిరణ్యక కెట్ట” ఆ హిరణ్యకశపునికి తన కుమారుడు ప్రహ్లాదుడు చాలాసార్లు చెప్పినాడు, తండ్రీ ఆ హరియే దేవుడు, దీనిని నమ్ము అంటే అహంకారంతో నమ్మక ఆ నరసింహస్వామి చేతిలో చీల్చివేయబడినాడు.

"అంబలికి ఆ సీత కెట్ట" ఆ జింక మాయా జింక అని రామలక్ష్మణులు ఇద్దరు ఆ సీతాదేవికి చెప్పారు. అయినా సీతాదేవి ఆ జింక నే కావాలి అని హఠం చేయగా రామలక్ష్మణులు దాని వెంబడించి పోగా రావణాసురుడు వచ్చి సీతమ్మను అపహరించి తీసుకొని వెళ్ళాడు. ఆమె ఎన్నో బాధలకు గురి అయినది.

"ఉండదలే ఆ దుర్వాస కెట్ట" దుర్యోధనుడు ఆ దుర్వాసుని పాండవుల వద్దకు వెయ్యి మంది శిష్యులతో భిక్షకు వెళ్ళమని ఉసిగొల్పగా శ్రీకృష్ణ భగవానుని మహిమతో ఆ దుర్వాసనకు గర్వభంగం అయినది. పాండవులు దుర్వాసుని శాపానికి గురి కాకుండా కాపాడబడినారు.

కనుక శిష్య భక్తాదులారా మీరంతా తెలుసుకోవలసినది ఇదే, విధిరాతకు ఎవరైనా తలవంచక తప్పదు. దీనిని అర్థం చేసుకొని దానికి అనుగుణంగా జీవనాన్ని సాగించవలెనని సూచిస్తున్నాను.